ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
5**
సోమవారం 14 అక్టోబరు 2024

అంబరాన్నంటిన దసరా సంబరాలు

- జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ఉత్సవాలు
- శమీ పూజ నిర్వహించిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- మేళతాళాల మధ్య మహిషాసురుడి దహనం
- వేల సంఖ్యలో పాల్గొన్న భక్తులు



కోరుట్లలో శమీ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య



రాయికల్‌లో మహిషాసుర దహనం

జగిత్యాల క్రైం, అక్టోబరు 13 : జగిత్యాల జిల్లా కేంద్రంలో విజయదశమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం నుంచి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జంబి గద్దె వద్దకు తీసుకువచ్చారు. జంబి గద్దె లోపల శమీ వృక్షాన్ని నెలకొల్పారు. అదనపు కలెక్టర్ రాంబాబు, బల్దియా చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, ఆర్డీవో మధుసూదన్, కౌన్సిలర్లు హాజరై శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చైర్ పర్సన్ జ్యోతి విజయదశమి వేడుకలను ప్రారంభించారు. అనంతరం జంబి ఆకును ఒకరికొకరు ఇచ్చుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో విజయ దశమిని పురస్కరించుకుని ఆయుధ, వాహనపూజ కార్యక్రమాన్ని ఎస్పీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ధరూర్ క్యాంప్‌లోని కోదండ రామాలయం, పద్మనాయక కల్యాణ మండపంలో వెలమ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో, మున్నూరు కాపుసంఘం ఆధ్వర్యంలో స్థానిక బీట్ బజార్‌తో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో దసరా వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్సీలు జీవన్ రెడ్డి, రమణలు శమిపూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పుర వీధుల గుండా దసరా దేవుని ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

మెట్‌పల్లి టౌన్: పట్టణంలో శనివారం దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దసరా పండుగా సందర్భంగా పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో, అయ్యప్ప ఆలయంలో, రామలయంలో, చెన్నకేశవనా థస్వామి ఆలయంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పాల్గొన్నారు. ఎమ్మెల్యే సంజయ్ ప్రత్యేక పూజలు నిర్వహించి శమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. త్రిశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు దసరా ఉత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ ప్రజలు చెన్న కేశవస్వామి ఆలయం వద్ద, మార్కెట్ యార్డులో ప్రత్యేక పూజలు నిర్వహించి జంబి కొట్టారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మహిషాసుర సంహారం భక్తులు ఘనంగా నిర్వహించారు. మహిషాసుర సంహార అనంతరం దుర్గమ్మను చెరువులలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రాణవేని సుజాత-సత్యనారయణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, ప్రజలు, పాల్గొన్నారు.

వైభవంగా మహిషాసురుడి దహనం

జగిత్యాలలో మహిషాసురుని దహనం వైభవంగా జరిగింది. నవదుర్గ, కనక దుర్గతో పాటు పలు సేవా సమితిల ఆధ్వర్యంలో మహిషాసురుని ప్రతిమను ఊరేగింపుగా తీసుకువచ్చి టపాసులు పెట్టి పేల్చారు. పెద్ద ఎత్తున ప్ర జలు హాజరై మహిషాసురుని దహనాన్ని తిలకించారు. ఎస్పీ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందో బస్తును ఏర్పాటు చేశారు. అనంతరం ధరూర్ శివారులో ని కాకతీయ కెనాల్‌లో దేవీ విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ఘనంగా దసరా వేడుకలు

రాయికల్, అక్టోబరు 13: రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో దసరా పర్వదినాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో జంబి వృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం బంగారాన్ని (జంబి ఆకు) ఇచ్చి పుచ్చుకుని పం డుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాయికల్ పట్టణంతో పాటు ఇటిక్యాల, రామాజీపేట, భూపతిపూర్, మూటపెల్లి తదితర గ్రామాల్లో మహిషాసుర సంహారాన్ని నిర్వహించారు. దుర్గాదేవి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.

కోరుట్ల : పట్టణంలో శనివారం దసరా వేడుకలు ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణంలో జరిగిన శమిపూజ మహోత్సవంలో, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య-అనిల్ ప్రత్యేక పూజలో పాల్గొన్న వేడుకలను ప్రారంభించారు. వెంకటేశ్వర ఆలయ వేదపండితుడు బానుమూర్తి ప్రత్యేక శమిపూజను నిర్వహించి జమ్మి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణంలో దుర్గాదేవి విగ్రహాలను పట్టణంలో పురవీధుల గుండా ఊరేగించి కాల్వగడ్డ ప్రాంతంలో మహిషాసుర మర్దనం నిర్వహించారు. అనంతరం దుర్గాదేవిలను స్థానిక వాగులో నిమజ్జనం చేశారు. పట్టణంలోని వేంకటేశ్వర స్వామి వారు అశ్వవాహనం ఊరేగగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. వెంకటేశ్వర దేవలంయలో శమి పూజ వేడుకలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావులు ఉత్సవాలలో పాల్గొన్నారు.



ఆయుధ పూజలో పాల్గొన్న ఎస్పీ అశోక్ కుమార్



శమీ పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



మెట్‌పల్లిలో జంబిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

దసరా వేడుకల్లో గ్రామస్థులపై దాడి



జగిత్యాల జిల్లా రాయికల్‌లో రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

- **చర్యలు తీసుకోవాలని రాస్తారోకో**

రాయికల్, అక్టోబరు 13 : జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని రామాజీపేట గ్రామంలో శనివారం రాత్రి జంబిపూజ సమయంలో గ్రామస్థులపై కొందరు వ్యక్తులు అకారణంగా దాడికి పాల్పడ్డారు. దీంతో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఆదివారం ఉదయం రాయికల్‌కు చేరుకుని దాడికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలో కొన్ని రోజులుగా ఏ పండుగ జరిగినా కొందరు యువకులు మద్యం మత్తులో గ్రామస్థులపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. వారిని ప్రశ్నించినవారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడుతున్నవారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

కేసు నమోదుచేసి విచారణ చేపడతామని సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సుధీర్ వారికి హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

ఇడ్లీలో జెర్రి

జగిత్యాలలో హోటల్ ఎదుట మహిళ ఆందోళన



ఇడ్లిలో వచ్చిన జెర్రి

జగిత్యాల అర్బన్, అక్టోబరు 13: జగిత్యాల జిల్లాకేంద్రంలోని ఓ హోటల్‌లో ఆదివారం ఉదయం ఓ మహిళకు ఇడ్లీలో జెర్రి వచ్చింది. ఉదయం 10 గంటల ప్రాంతంలో తన కుటుంబసభ్యులతో హోటల్‌కు వచ్చిన మహిళ తన పిల్లలకు ఇడ్లీ తినిపిస్తుండగా అందులో జెర్రీ కనిపించడంతో ఆందోళన చెందింది. ఈ విషయమై హోటల్ యజమానిని ప్రశ్నించడంతో సదరు యజమాని అది జెర్రీ కాదని, నల్ల దారం అంటూ తప్పించుకోబోయాడు. ఆ ఇడ్లీని తన నోట్లో వేసుకున్నారు. అందులో వచ్చింది జెర్రీ అని నిర్ధారించుకున్నాక నోట్లో వేసుకున్న ఇడ్లీని ఉమ్మివేశాడు. పిల్లలకు పెట్టే ఇడ్లీలో వచ్చిన జెర్రీని తాను గమనించకపోతే పరిస్థితి ఎలా ఉండేదని మహిళ హోటల్ యజమానిని ప్రశ్నించింది. హోటల్ ఎదుట ఆందోళనకు దిగి యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఇడ్లీలను బల్దియా ట్రాక్టర్‌లో తీసుకువెళ్లేందుకు ప్రయత్నించగా బాధితురాలితో పాటు అక్కడి ప్రజలు అడ్డుకున్నారు. ఇడ్లీలను రోడ్డు మీద పారవేసి ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్న ఇలాంటి హోటళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన మున్సిపల్ అధికారులు, ఆహార సురక్షిత విభాగం అధికారులు హోటల్‌లో పరిశీలించి ఆహార ప్రమాణాలు సరిగా పాటించడం లేదని నిర్ధారించారు. మహిళ చేసిన ఫిర్యాదుతో పోలీసులు హోటల్ యజమానిపై కేసు నమోదు చేయడంతోపాటు హోటల్‌ను తాత్కాలికంగా మూసివేశారు.

వైభవంగా నర్సింహస్వామి ఊరేగింపు



నర్సింహస్వామిని ఊరేగిస్తున్న ఆలయ అధికారులు

కొడిమ్యాల, అక్టోబరు 13 : మండలంలోని నల్లగొండ గ్రామ శివారులో ఎత్తైన గుట్టపై ఉన్న శ్రీలక్ష్మీనృసింహ స్వామివారి ఊరేగింపు దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం గ్రామంలోని వీధులలో వైభవంగా జరిగింది. అంతకు ముందు శమీ పూజను అర్చకులు నిర్వహించారు. అనంతరం నర్సింహస్వామి గోవిందా... నల్లగొండ నర్సింహస్వామి గోవిందా అంటూ గోవింద నామ స్మరణతో ఆలయం నుంచి భక్తులు, ఆలయ సిబ్బంది, అర్చకులు స్వామి వారిని గ్రామంలోకి తీసుకవచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల య చైర్మన్ సత్యనారాయణరావు కుమారుడు రమాపతి రావు, ఆలయ సిబ్బంది కమలాకర్, రవి, అర్చకులు శ్రీనివాసాచార్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అటవీ కార్యాలయంలో సిబ్బంది విందు

- **జగిత్యాలలో ఐదుగురు ఉద్యోగులపై వేటుకు రంగం సిద్ధం**

జగిత్యాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో ఉద్యోగులు మద్యంతో విందు చేసుకున్న వ్యవహారం వివాదాస్పదంగా మారింది. శుక్రవారం రాత్రి దసరా వేడుకల్లో భాగంగా ముందస్తుగా అటవీశాఖ అధికారులు, ఉద్యోగులు జిల్లా శాఖ కార్యాలయంలో మైసమ్మ యాట పూజలు నిర్వహించారు. అనంతరం జిల్లాలోని కొందరు టింబర్ డిపో వ్యాపారులతో కలిసి అటవీ శాఖ కార్యాలయ ఆవరణలో మద్యం తాగుతూ విందు చేసుకోవడం వివాదాస్పదమైంది. ప్రభుత్వ కార్యాలయంలో సిబ్బంది మద్యంతో దావత్ చేసుకుంటున్నారన్న విషయాన్ని కొందరు సోషల్ మీడియాలో వైరల్ చేశారు. విషయం పై అధికారులకు తెలియడంతో ఉన్నతాధికారులు శాఖాపరమైన విచారణ జరిపారు. బాధ్యులపై వేటు వేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇందుకు కారకులైన అయిదుగురు ఉద్యోగులపై చర్యలకు సిఫారుసు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ విందును టింబర్ డిపో వ్యాపారులు ఏర్పాటు చేసినట్లుగా సమాచారం. ఈ విషయమై జగిత్యాల ఫారెస్టు రేంజ్ అధికారి పద్మారావును సంప్రదించగా కార్యాలయంలో విందు వ్యవహారంపై వచ్చిన ఆరోపణల మేరకు విచారణ జరిపామని, ప్రస్తుతం జిల్లా అటవీ శాఖాధికారి రవి ప్రసాద్ అందుబాటులో లేరని, బాధ్యులపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముగిసిన శరన్నవరాత్రులు

- **వైభవంగా దుర్గా మాత శోభాయాత్ర**



దుర్గాదేవిని నిమజ్జనం చేస్తున్న భక్తులు



వెల్గటూర్ మండలం స్తంభంపల్లిలో దుర్గా మాత శోభాయాత్ర

ధర్మపురి, అక్టోబరు 13: ధర్మపురి మండలంలో దుర్గాదేవి నిమజ్జన వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు జరి పారు. అనంతరం దసరా పండుగ రోజున అమ్మవారలను ఊరేగింపుగా తీసుక వెళ్లి గోదావ రిలో నిమజ్జనం చేశారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలకగా భక్తులు అమ్మ వారలను దర్శించుకున్నారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ గంగుల మహేష్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

వెల్గటూర్: మండలంలో వివిధ గ్రామాలలో నిర్వహించిన శరన్నవరాత్రులు శనివారం ము గిశాయి. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య దుర్గా మాతకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం శోభాయాత్ర నిర్వహించారు. దుర్గమ్మ శోభాయాత్ర అనంతరం గ్రామ శివారు ప్ర ధాన కూడళ్ల వద్ద మహిసాసు సంహారం నిర్వహించారు. మహిసాసురిని బొమ్మను తయా రు చేసి అమ్మవారి చేతుల మీదుగా సంహరిస్తున్నట్లు రాకెటు టపాసులతో మహిసాసురున్ని సంహరించిన తీరు ఆకట్టుకుంది.

మల్యాల: మల్యాల మండల కేంద్రంతో పాటు ముత్యంపేట, రాంపూర్, రామన్నపేట, తాటి పెల్లి, లంబాడిపెల్లి, మ్యాడంపెల్లి, కొండగట్టు తదితర గ్రామాలలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాలను ఆయా గ్రామాలలో శోభాయాత్ర నిర్వహించి వరదకాలువ, కెనాల్, చెరువులలో నిమజ్జనం చేశారు. ముత్యంపేట, మార్కండేయ ఆలయం వద్ద మహిసాసుర దహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంకు వేలాదిగా జనం హజరయ్యారు.

కొడిమ్యాల : మండలంలోని వివిధ గ్రామాల్లో దుర్గాదేవి నిమజ్జనాలను భక్తులు ఊరేగింపుతో తీసుక పోయి నిమజ్జనం చేశారు. పలు వీదులలో అర్ధరాత్రి వరకు ఊరేగింపుగా తీసుకవెళ్లి నీటిలో నిమజ్జనం చేశారు. అంతక ముందు గ్రామంలోని అంగడి బజారులో మహిసాసూరున్ని ధహనం చేశారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రము ఖులు, నాయకులు పాల్గొన్నారు. వివిద గ్రామాల్లో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా సాయిబాబా పుణ్యతిథి వేడుకలు

భక్తులతో కిటకిటలాడిన షిరిడిసాయిబాబా దేవాలయం

కోరుట్ల, అక్టోబరు 13 : కోరుట్ల షిరిడీ సాయిబాబా దేవాలయంలో ఆదివారం 106వ పుణ్యతిథి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. దసరా మరుసటి రోజు నిర్వహించే పుణ్యతిథి వేడుకల సందర్భంగా ఆయా ప్రాంతాలకు చెందిన వేల సంఖ్యలో భక్తులు వేడుకలకు హాజరయ్యారు. ఉదయం 5 గంటల నుంచి కాగడ హారతి, ఆలయ సంకీర్తన, అభిషేకము, పతాకారో హణ, గణపతి పూజ, కలుషాభిషేకం, విశ్వకళ్యాణ యజ్ఞం, హోమంతో పాటు ప్రత్యేక పూజలను వేదపండితులు ఘనంగా నిర్వహించారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, కోరుట్ల, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం అనిల్-అనిల్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు వైస్ చైర్మన్ గడ్డ మీది పవన్, కాంగ్రెస్ బీఆర్ఎస్ నాయకుడు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. మహాఅన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ప్రారంభించారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, జగిత్యాల, మంచిర్యాల తదితర జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల షిరిడి సాయిబాబా భక్త సమాజం సభ్యులు, అభివృద్ధి కమిటీ సభ్యులు, మున్సిపల్ పాలక వర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



కోరుట్లలో ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు

పోలీసుల భారీ బందోబస్తు

పట్టణం శివారులోని సాయిబాబ దేవాలయంలో నిర్వహించిన పుణ్యతిథి వేడుకలకు ఏలాంటి అవాంచనీయ సంఘటన చోటు చేసుకుండా పోలీసులు భారీ బందోస్తును నిర్వహించారు. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు ప ర్యవేక్షణలో కోరుట్ల సీఐ సురేష్ బాబు ఆధ్వర్యంలో బార బందోబస్తును నిర్వహించారు. కోరుట్ల, మెడిపల్లి, కథలాపూర్ ఎస్ఐలు శ్రీకాంత్, శ్యామ్‌రాజు, నవీన్‌లు వారి సిబ్బందితో ప్రత్యేక బందోబస్తున్న నిర్వహించారు.

కోరుట్ల రూరల్ : కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామంలో ఆదివారం సాయి పుణ్యతిథి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో ఉదయం ప్రత్యేక పూజలు అభిషేకాలను నిర్వహించారు. గ్రామ స్థుల ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహంచారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మెన్ మోహన్ రెడ్డి, కౌన్సిలర్లు సుజాత - మురళిలతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

విషాదాంతమైన వివాహిత ప్రేమ వ్యవహారం

- రెండు రోజుల క్రితం యువకుడి హత్య - ఆత్మహత్యకు పాల్పడిన మహిళ

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 13: మహిళ ప్రేమ వ్యవహారం విషాదాంతమైంది. రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. వివాహితను ప్రేమించిన యువకుడు రెండు రోజుల క్రితం హత్యకు గురికాగా... సదరు వివాహిత సైతం ఆదివారం ఆత్మహత్య చేసుకున్నది. గోదావరిఖని బాపూజీనగర్‌కు చెందిన అంజలికి సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో స్కావెంజర్‌గా పనిచేస్తున్న వడ్లాది వినయ్‌కుమార్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. అప్పటికే పెళ్లి అయి భర్త ఇద్దరు సంతానం ఉన్న అంజలిని వినయ్‌కుమార్ రెండు నెలల క్రితం గుడిలో పెళ్లి చేసుకున్నాడు. పెళ్లికి ఇరుకుటుంబాలు అంగీకరించకపోవడంతో కాలనీలోని హనుమాన్‌నగర్‌లో నివసిస్తున్నారు. ఈక్రమంలో ఈనెల 10న అంజలి భర్త, సోదరుడు కాలనీలోని వినయ్‌కుమార్ ఇంటికి వచ్చి కత్తులతో దాడి చేసి హత్య చేశారు. వినయ్ కుటుంబ సభ్యులు అంజలితో పాటు వారి కుటుంబ సభ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన తర్వాత ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా నల్లజర్లలో బంధువుల ఇంట్లో ఉంటున్న అంజలి ఆదివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

ధర్మపురిలో వైభవంగా దసరా ఉత్సవాలు


శమీ వృక్షం వద్ద పూజలో పాల్గొన్న ప్రభుత్వ విప్, అధికారులు


గాలిలోకి కాల్పులు జరుపుతున్న ధర్మపురి సీఐ, ఎస్ఐ

ధర్మపురి, అక్టోబరు 13: ధర్మపురి క్షేత్రంలో దసరా ఉత్సవాలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీనృసింహస్వామి, వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ఆలయం నుంచి చింతామణి చెరువు గట్టు మీదుగా క్షేత్ర సమీపంలో గల నూతన జమ్మిగద్దె వరకు ఊరేగింపు జరిపారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య శమీ వృక్ష పూజలు నిర్వహించారు. పోలీస్ శాఖ పక్షాన ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ గంగుల మహేష్ గౌరవ వందనంగా తుపాకితో రెండుసార్లు గాలిలోకి కాల్పులు జరిపారు. అనంతరం స్వామి వారల సేవలను అక్కడి నుంచి కమలాపూర్ చౌరస్తా, బస్ స్టేషన్, బ్రాహ్మణ వీధి మీదుగా ఇసుక స్తంభం వరకు ఊరేగింపు జరిపారు. ఇసుక స్తంభం వద్ద గల మండపంలో ప్రత్యేక పూజలు అనంతరం స్వామి వారల సేవలను తిరిగి ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయం పక్షాన స్థానిక బస్‌స్టేషన్ ఆవరణలో ఈవో సంకటాల శ్రీనివాస్ రావణ దహనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని రాత్రి వరకు తిలకిం చారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, టీపీసీసీ సభ్యుడు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కు రవీందర్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సింహరాజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● **శమీ పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ అడ్లూరి**

ధర్మపురి క్షేత్ర సమీపంలో గల జంబి గద్దె వద్ద నిర్వహించిన శమీ వృక్ష పూజల్లో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతం శమీ వృక్ష పూజకు బయలు దేరిన స్వామివారల సేవను అయన మోసి భక్తిప్రపత్తులు చాటుకున్నారు.

● **వేములవాడలో రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు**

వేములవాడ కల్చరల్: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. విజయదశమి పర్వదినాన్ని పురష్కరించుకొని శనివారం రాజరాజేశ్వరీ దేవి అమ్మవారు మహాలక్ష్మి (పాలవెల్లి) రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. పార్వతిపరమేశ్వరులు, లక్ష్మీసమేతపద్మనాభస్వామి ఉత్సవమూర్తులకు అంబారీ సేవపై పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద సేవతో పట్టణ పురవీధుల్లో శమియాత్ర నిర్వహించారు. మహాలక్ష్మీ వీధిలోని జమ్మిచెట్టు వరకు ఊరేగింపు నేత్రపర్వంగా కొనసాగింది. శమియాత్రలో భాగంగా పెద్ద సేవలో పాల్గొనేందుకు హాజరైన భక్తులు పెద్ద సంఖ్యలో పార్వతీపరమేశ్వరులను దర్శించుకున్నారు. ముందుగా ఆలయంలోని లక్ష్మీపద్మనాభ ఆలయ ప్రాంగణంలో ఆయధాలను ఒక్కచోట పేర్చి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయుధ పూజ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముందుగా రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకుని ఆయధ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.


వేములవాడలో అంబారీ సేవపై ఊరేగుతున్న ఉత్సవమూర్తులు


రాజన్న ఆలయంలో ఆయుధ పూజలో పాల్గొన్న ఆది శ్రీనివాస్

అదుపు తప్పిన కారు

- రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్‌కు ఢీ


రోడ్డు కిందకు దూసుకెళ్లిన కారు

సుల్తానాబాద్, అక్టోబరు 13: సుల్తానాబాద్ మండలంలోని సుగ్లాంపల్లి వద్ద కారు వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కనునన్న కల్వర్ట్‌లో పడి పోయింది. అక్కడే ఉన్న 15 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గోదావరిఖని ఎన్టీపీసీకి చెందిన పోతు అశోక్ అనే వ్యక్తి ఆదివారం ఉదయం తన కుటుంబసభ్యులను కారులో కరీంనగర్‌లో దింపి తిరిగి మధ్యాహ్నం ఎన్టీపీసీ వస్తున్నాడు. ఈ క్రమంలో సుగ్లాంపల్లి వద్ద కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. షార్ట్ సర్క్యూట్ జరగకపోవడంతో ప్రమాదం తప్పింది. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

రేణికుంట టోల్ గేట్ వద్ద వాహనాల రద్దీ

- కిలోమీటర్ మేర నిలిచిన వాహనాలు - హైదారాబాద్ వైపు వెళ్లే వాహనాదారులకు ఇబ్బందులు

తిమ్మాపూర్, అక్టోబరు 13: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట గ్రామం వద్ద రాజీవ్ రాహదారిపై ఉన్న టోల్‌గేట్ వద్ద ఆదివారం కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో కరీంనగర్ నుంచి హైదారాబాద్ వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడ్డారు. దసరా పండగ సందర్భంగా హైదారాబాద్ నుంచి తమ స్వగ్రామాలకు వచ్చిన వారు తిరిగి ఆదివారం హైదారాబాద్‌కు పయనమయ్యారు.

కరీంనగర్ నుంచి హైదారాబాద్ వైపునకు వెళ్లే వారు ఎక్కువ ఉండడంతో వందల సంఖ్యలో వివిధ రకాల వాహనాలు రేణికుంట టోల్ గేట్ వద్ద బారులు తీరాయి. కిలోమీటర్ వరకు వాహనాలు బారులు తీరడంతో వాహనాదారులు ఇబ్బందిపడ్డారు. చివరికి సిబ్బంది టోల్ డబ్బులు తీసుకోకుండానే లైన్‌లో వచ్చినవి వచ్చినట్లు పంపించారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది.


టోల్ ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు

దసరా వేడుకల్లో అపశృతి

- విద్యుదాఘాతంతో యువకుడి మృతి
- గ్రామంలో నిలిచిన వేడుకలు

భీమారం, అక్టోబరు 13: జగిత్యాల జిల్లా భీమారం మండలంలోని రాగోజీపేట గ్రామంలో దసరా వేడుకల్లో శనివారం అపశృతి చోటు చేసుకుంది. గ్రామంలో దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని మహిషాసుర మర్దన కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలోనే మహిషాసురుడికి నిప్పు పెట్టే ప్రయత్నంలో విద్యుత్ తీగను గ్రామానికి చెందిన అరిసెల వెంకటేష్ (35) సరి చేసే క్రమంలో అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు వైరు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై కుప్పకూలాడు. గమనించిన స్థానికులు వెంటనే జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటేష్ మృతితో గ్రామంలో దసరా ఉత్సవాలు ఆగిపోయాయి. మృతుడికి భార్య, కూతురు ఆద్య(10), కొడుకు ఆర్యన్(6) ఉన్నారు. మృతుడు వెంకటేష్ భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై శ్యాంరాజ్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


వెంకటేష్ (ఫైల్)

'నిత్యాన్నదానం' సరుకులు చోరీ

● **కొండగట్టు అంజన్న సన్నిధిలో ఘటన**
● **సదరు అధికారికి మెమో జారీ**

మల్యాల, అక్టోబరు 13: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థనం పరిధిలో నిర్వహిస్తున్న నిత్యాన్నపథకంకు వినియోగించే సరుకులు చోరీకి గురైనట్లు వచ్చిన ఫిర్యాదులపై అధికారులు సంబంధిత అధికారికి మెమో జారీ చేశారు. కొండగట్టులో నిర్వహిస్తున్న నిత్యాన్నదానం పథకంలో భాగంగా అన్నదానానికి వినియోగించే సరుకులను ఈ నెల 9న ఆటోలో తరలించిన్నట్లు పలువురు దేవస్థానం అధికారులక ఫిర్యాదు చేశారు. దీంతో సీసీ కెమెరాలను అధికారులు పరిశీలించినట్లు తెలిసింది. ఈవో రామకృష్ణరావు ఆదేశాల మేరకు ఆదివారం ఏఈవో అంజయ్య అన్నదానం ఇన్‌చార్జి రాములుకు మెమో జారీ చేశారు. 24 గంటల్లోపు సంజాయిషీ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. సదరు అన్నదానం ఇన్‌చార్జి గతంలో పని చేసిన చోట ఇలాంటి ఆరోపణలు ఉన్నట్లు చర్చించుకుంటున్నారు. అయితే అన్నదానం సరుకుల అక్రమ తరలింపుపై అధికారులు విచారణ జరిపి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎస్సారెస్పీ కాలువలో మృతదేహం గుర్తింపు

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 13: మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామానికి చెందిన సుంకేట కొండస్వామి(46)అను వ్యక్తి మృతదేహం ఎస్సారెస్పీ కాలువలో ఆదివారం గుర్తించారు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 10న ఇంట్లో ఎవరికి తెలపకుండా వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమం లో మేడిపల్లి మండలంలోని కట్లకుంట గ్రామసమీపంలోని ఎస్సారెస్పీ కాలువ లో సుంకేట కొండస్వామి మృతదేహం కనిపించగా కుటుంబ సభ్యులకు తెలి పారు. మెట్‌పల్లి వెళ్లి తిరిగి మెట్లచిట్టాపూర్‌కు వస్తున్న క్రమంలో వెల్లుల్ల గ్రామశివారులోని ఎస్సారెస్పీ కాలువ సమీపంలో బహిర్భుమికి వెళ్లి ప్రమాదవ శాత్తు అందులో పడి మృతి చెంది ఉంటాడని కుటుంబసభ్యులు, పోలీసులు భావిస్తున్నారు. మృతుడి కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో దాడి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

● **దసరా వేడుకల్లో ఘర్షణ**

మల్యాల, అక్టోబరు 13: దసరా వేడుకల సందర్భంగా మండలంలోని ఓగులాపూర్‌లో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ కత్తులతో దాడికి దారి తీయగా ఈ ఘటనలో ఇద్దరు గ్రామస్థులు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో దసరా వేడుకల్లో భాగంగా శనివారం గ్రామస్థులు శమి పూజకు వెలుతున్న క్రమంలో గ్రామానికి చెందిన రెండు వర్గాల మధ్య ఘర్షణ నెలకొని వాగ్వాదం జరిగింది. రాత్రి వేళల్లో మళ్లీ ఇరువర్గాలు గొడవ పడగా ఒక వర్గానికి చెందిన ఏడుగురు వ్యక్తులు కత్తితో దాడి చేయడంతో మేరుగు మనోహర్ అనే యువకుడు కత్తిపోట్లకు గురయ్యాడు. ఇదే గొడవలో మండల మహేశ్ అనే వ్యక్తి తన కొడుకు దినేశ్ కోసం వెళ్లగా వారిపై కూడా దాడి చేయడంతో మహేశ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఇద్దరిని చికిత్స కోసం జగిత్యాల తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. బాధితుడు మేరుగు మనోహర్ ఫిర్యాదు మేరకు దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

అలాగే మల్యాలలోని ఒర్రెగడ్డ వైన్స్ వద్ద దసరా సందర్భంగా యువకులు పరస్పరం దాడులకు పాల్పడ్డా రు. వందలాది యువకులు పోగు అయి రహదారిపైనే దాడులకు పాల్పడడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో స్వల్ప ఘర్షణలు చోటుచేసుకోగా పోలీసులు పర్యవేక్షించారు.

జగిత్యాలలో ఒకరిపై దాడి

జగిత్యాల క్రైం, అక్టోబరు 13: జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఓ హోటల్‌లో కస్టమర్‌పై నిర్వాహకులు దాడి చేసిన ఘటన శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కిషన్ అనే వ్యక్తి జగిత్యాలలోని ఓ హోటల్‌లో టిఫిన్ చేసేందుకు వెళ్లాడు. టిఫిన్ విషయంలో నిర్వాహకులతో వాగ్వాదం జరగడంతో కిషన్‌పై దాడి చేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

తండ్రి వర్ధంతికి వస్తూ.. కానరాని లోకాలకు..

- అదుపుతప్పి కారు బోల్తా.. యువకుడి మృతి

ఓదెల, అక్టోబరు 13: కన్నతండ్రి వర్ధంతి కార్యక్రమానికి హాజరుకావాలనే ఆతృత కొడుకు నిండు ప్రాణాలను బలితీసుకుంది. కారులో అర్ధరాత్రి అతివేగంగా ప్రయాణిస్తున్న క్రమంలో ఘోరరోడ్డు ప్రమాదానికి గురై తీవ్రగాయాలతో యువకుడు మృతిచెందిన ఘటన జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం వడ్డిచర్లలో జరిగింది. వివరాల్లోకెళితే.. పెద్దపెల్లి జిల్లా ఓదెల మండలం మడక గ్రామానికి చెందిన నోముల రవీందర్‌రెడ్డి(32) అనే యువకుడు నల్లగొండ జిల్లా కేంద్రంలో వండర్‌వరల్డ్ పేరిట ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో నల్లగొండ నుంచి స్వగ్రామం మడకలో తన తండ్రి రాంచంద్రారెడ్డి రెండో వర్ధంతి కార్యక్రమం ఆదివారం జరగనుండగా అక్కడికి సకాలంలో చేరుకునేందుకు తెల్లవారుజామున కారులో బయలుదేరాడు. ఈ క్రమంలో వడ్డిచర్ల శివారుకు చేరుకునే వరకు అతివేగానికి నిద్రమత్తు తోడై కారు అదుపు తప్పి రోడ్డుపక్కకు బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన రవీందర్‌రెడ్డిని స్థానికులు 108 ద్వారా జనగామ ఆసుపత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో మృతిచెందాడు. కాగా లింగాలఘణపురం ఎస్సై శ్రవణ్‌కుమార్ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. అయితే మృతుడికి తల్లి శ్రీలత, సోదరులు కిషన్‌రెడ్డి, రాజిరెడ్డిలు ఉండగా రాజిరెడ్డి వారం రోజుల క్రితమే ఉన్నత చదువుల నిమిత్తం లండన్‌కు వెళ్లడం గమనార్హం.


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు, ఇన్‌సెట్‌లో రవీందర్‌రెడ్డి(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

శంకరపట్నం, అక్టోబరు 13: దసరా పండుగకు పెద్దమ్మ ఇంటికి వెళ్లి వస్తానని చెప్పిన ఓ యువకుడు శనివారం శంకరపట్నం మండలం తాడికల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. పోలీసుల కథనం ప్రకారం..చిగురుమామిడి మండలం లంబాడిపల్లెకు చెందిన బండారిపల్లి వినయ్ (25) కరీంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. శనివారం దసరా పండుగకు తాడికల్‌లోని పెద్దమ్మ ఇంటికి వెళ్లి వస్తానని తండ్రి రామస్వామికి చెప్పాడు. వినయ్ కరీంనగర్ నుంచి బైక్‌పై వస్తుండగా, తాడికల్ శివారులోని శివాలయం సమీపంలోని మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టింది. దీంతో వినయ్ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. పండుగ పూట వినయ్ మృతితో కుటుంబసభ్యులు, బంధువులు రోదనలు మిన్నంటాయి. మృతుడు వినయ్ తండ్రి రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్త


మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

వీర్నపల్లి, అక్టోబరు 13: మండలంలోని జవహర్లాల్ నాయక్ తండాలో భార్య గొంతుకు తాడు బిగించి భర్త హత్య చేశాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. జవహర్లాల్ నాయక్ తండాకు చెందిన గుగులోతు సుశీల (40)ను భర్త గుగులోతు రవి హత్య చేసి పరారయ్యాడు. రవి కొంతకాలంగా మద్యం తాగుతూ భార్య సుశీలతో గొడవ పడుతుండేవాడు. శనివారం దసరా పండగ రోజు ఆమె పిల్లలు లాల్ సింగ్ తండాలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లారు. రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న భార్యను తాడుతో గొంతుకు బిగించి హత్య చేసి ఇంటి ముందర మంచంపై పడుకోబెట్టి పరారయ్యాడు. ఆదివారం ఉదయం ఇంటికి చేరుకున్న కుమారుడు సాయిచరణ్, కూతురు షర్మిల ఇంటి ఎదుట మంచంపై విగత జీవిగా పడి ఉన్న తల్లిని చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న సుశీల కుటుంబసభ్యులు భర్త రవి హత్య చేసి పారిపోయాడంటూ పోలీసులకు తెలిపారు. సుశీల హత్యతో తండాలో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్ గౌడ్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, ఇంటి తాళాన్ని పగలగొట్టి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో పరిశీలించారు. ఇంట్లో తాడు ఉండడంతో భర్తనే తాడుతో హత్య చేసినట్లు నిర్ధారించుకొని పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు.

నిందితుడు గుగులోతు రవిపై గతంలో పలు కేసులు నమోదయ్యాయి. ఇటీవల బ్లూ కోల్ట్స్ సిబ్బందిపై దాడి చేశాడు. మృతురాలి అన్న భూక్య లోక్‌నాయక్ ఫిర్యాదుతో గుగులోతు రవిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై ఎల్లాగౌడ్ తెలిపారు. ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్, గంభీరావుపేట ఎస్సై శివకుమార్, శిక్షణ ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు

అప్పుల వేధింపులతో ఒకరి ఆత్మహత్య


సాయికృష్ణ (ఫైల్)

తంగళ్లపల్లి, అక్టోబరు 13: అప్పు చెల్లించాలనే వేధింపులు భరించలేక తంగళ్లపల్లి మండలం మండెపల్లి కేసీఆర్ నగర్‌కు చెందిన దుబాసి సాయికృష్ణ (27) ఉరేసుకొని శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. కేసీఆర్ నగర్‌కు సాయికృష్ణ అదే కాలనీకి చెందిన నూతి అనిల్ వద్ద రూ.20 వేలు అప్పు చేశాడు. రెండు రోజుల క్రితం అప్పు చెల్లించాలని వేధింపులకు గురిచేసి సాయికృష్ణ ఫోన్‌ను బలవంతంగా లాక్కెళ్లాడు. అవమానంగా భావించి తీవ్ర మనస్తాపానికి గురై శనివారం దసరా పండుగ రోజు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. సాయికృష్ణకు భార్య ఉదయశ్రీ, కుమారుడు ఉన్నారు. నూతి అనిల్ వేధింపులతోనే తన కుమారు డు సాయికృష్ణ ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి దుబాసి విజయ పోలీసుల కు ఫిర్యాదు చేసింది. అనిల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాంమోహన్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 13: మండల కేంద్రంలో అద్దెకు ఉంటూ స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో డయాలసిస్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న కొప్పూరి మాధవ (27) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై రమాకాంత్ శనివారం తెలిపారు. మృతుడి స్వగ్రామం నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ గ్రామమని పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌కు చెందిన కొప్పూరి మాధవ మూడేళ్ల కిందట ఎల్లారెడ్డిపేటకు వచ్చి ఓ గదిని అద్దెకు తీసుకుని జీవిస్తున్నాడు. స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో డయాలసిస్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. అదే ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న మరో నలుగురు యువకులతో కలిసి గదిలో ఉంటుండేవాడు.

ఈ నెల 11న ముగ్గురు ఆసుపత్రికి వెళ్లారు. రాత్రి మాధవ ఒక్కడే తలుపునకు గడియ వేసుకుని ఉన్నాడు. అదే రోజు రాత్రి 11.30 గంటలకు విధులు ముగించుకున్న యువకుడు అభిలాష్ గదిని చేరుకుని తలుపు తట్టాడు. ఎంత పిలిచినా మాధవ తలుపులు తీయకపోవడంతో తిరిగి అభిలాష్ ఆసుపత్రికి వెళ్లి నిద్రకు ఉపక్రమించాడు. ఈ నెల 12న అనుమానం వచ్చిన గది యజమాని తలుపులు పగులకొట్టి చూసే సరికి మాధవ మృతి చెంది కనిపించడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు సోదరుడు శేషాద్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

● **మానకొండూర్ మండలం వెల్దిలో..**


త్రినాథ్(ఫైల్)

మానకొండూర్: మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన ఇల్లందుల త్రినాథ్ (21) అనే యువకుడు అనుమానాస్పదస్థితిలో వ్యవసాయబావిలో పడి మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్ది గ్రామానికి చెందిన ఇల్లందుల బాగ్యమ్మ-నాంపెల్లి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు త్రినాథ్ ఉన్నారు. పదో తరగతి చదివిన త్రినాథ్ ఆటో నడుపుతూ తండ్రికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. శనివారం త్రీనాథ్ తన మిత్రులు రుద్రారం తిలక్, కొమ్మగల్ల కిరణ్, రామగిరి సందీప్ కలిసి ఆటో(ఏపీ15టీసీ1433)లో మండలంలోని రంగపేట గ్రామ శివారులోకి వెళ్లారు. రాత్రి వరకు అక్కడే ఉన్నారు. అనంతరం త్రీనాథ్ వ్యవసాయబావిలో పడి మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు త్రీనాథ్ బావి వద్దకు చేరుకొని స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ లక్ష్మీనారాయణ పరిశీలించారు. బావిలో నీరు ఎక్కువగా ఉండడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. రాత్రి నుంచి తెల్లవారే సరికి బావిలోని నీరు తోడివేశారు. ఆదివారం బావిలో నుంచి మృతదేహాన్ని బయటికి తీశారు. పండుగ పూట ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రైలు కిందపడి మేషన్ కార్మికుడి ఆత్మహత్య

ఓదెల, అక్టోబరు 13: మండలంలోని పొత్కపల్లి 29వ, రైల్వే గేట్ సమీపంలో ఆదివారం ఇదే మండలం జీలకుంటకు చెందిన రెడ్డి ఆదిత్య (30) అనే మేషన్ కార్మికుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యాదవ సంఘం కమ్యూనిటీ భవన్ సమీపంలో గల అప్ రైల్వే లైన్ పట్టాల మధ్యన పడుకొని తలను లైన్ పైన పెట్టిన వెంటనే అదే లైన్‌లో వస్తున్న రైలు డ్రైవర్ హారన్ కొట్టిన కూడా పక్కకు జరగకపోవడంతో రైల్ చక్రాల కింద తల నుజ్జునుజ్జయింది.

ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఇప్పటివరకు జీ.ఆర్.పి పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు. శనివారం వరకు పండుగల వేడుకల్లో కుటుంబంతో, మిత్రులతో గడిపిన ఆదిత్య మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.


కోరుట్ల మండలం పైడిమడుగులో శమీపూజ


వెల్గటూర్ మండలం స్తంభంపల్లిలో వేంకటేశ్వర స్వామి పల్లకీ సేవ



జగిత్యాలలో శమీపూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ..మల్యాల మండలం ముత్యంపేటలో ఉత్సవమూర్తుల ఊరేగింపు..

ఘనంగా దసరా వేడుకలు

శమీ పూజ నిర్వహించిన ప్రజాప్రతినిధులు, అధికారులు


పెగడపల్లిలో దుర్గామాత అమ్మవారి శోభాయాత్ర


ధర్మపురిలో స్వామివారల ఊరేగింపు...


బుగ్గారంలో జంబివద్ద పూజలు

జిల్లా వ్యాప్తంగా విజయదశమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఉత్సవమూర్తులను ఊరేగింపుగా జంబి గద్దె వద్దకు తీసుకువచ్చారు. జంబి గద్దె లోపల శమీ వృక్షాన్ని నెలకొల్పారు. హాజరై శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విజయద శమి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, వహిళలు, చిన్నారులు పాల్గొని ఉత్సాహంగా పాల్గొని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండుగ సందర్భంగా ఆలయాల్లో ఉదయం నుంచే రద్దీ పెరిగింది. అర్చకులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.. జంబి ఆకును ఒకరినొకరు ఇచ్చిపుచ్చుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే తొమ్మిది రోజులుగా కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. అమ్మవారలను శోభాయాత్రగా తీసుకెళ్లి గోదావరిలో నిమజ్జనం చేశారు.

-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


వెల్లులలో


కొడిమ్యాలలో మహిషాసురుడి దహనం


కోరుట్లలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు





కథలాపూర్ మండలం భూషణరావుపేటలో జమ్మిఆకు సేకరిస్తున్న గ్రామస్థులు.భీమారంలో దసరా వేడుకల్లో పాల్గొన్న ప్రజలు..మల్లాపూర్, బీర్‌పూర్‌లో శమీ పూజలు

అంజన్న సన్నిధిలో న్యాయాధికారి పూజలు


కొండగట్టులో న్యాయాధికారికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

మల్యాల, అక్టోబరు 13: కొండగట్టు ఆంజనేయస్వామిని ఆదివారం ఎస్సీ, ఎస్టీ సెసన్స్ కోర్టు న్యాయాధికారి శ్రీమతి ఏ.నీరజ దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ సిబ్బంది అశోక్ శేషవస్త్రాలతో సత్కరించారు. దసరా సందర్భంగా శనివారం ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కూడా అంజన్నను దర్శించుకున్నారు

● వాహన పూజల ఆదాయం రూ.3.37లక్షలు

కొండగట్టు అంజన్న సన్నిదిలో దసరా సందర్భంగా మూడు రోజుల పాటు వేలాది వాహనాలకు పూజలు నిర్వహించగా వాటి ద్వారా దేవస్థానానికి రూ.3లక్షల37వేల900 ఆదాయం వచ్చింది. గతేడాది దసరాకు నిర్వహించిన వాహనపూజల ద్వారా రూ.2లక్షల 67వేల 600 సమకూరగా ఈ సారి రూ. 70వేల300 అదనంగా వచ్చినట్లు ఈవో రామకృష్ణరావు పేర్కొన్నారు.

బెహరాన్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 13: పద్మశాలి సమాజ్ బెహరాన్ ఆధ్వర్యంలో ఈ నెల 11న బతుకమ్మ పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెహరాన్‌లో కన్నడ భవన్‌లో ఆడిటోరియంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా మహిళలు బతుకమ్మ సంబరాలను జరిపారు. ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన సంప్రదాయాలను ఇక్కడ పుట్టి పెరిగిన వారికి తెలిసేల ప్రతి యేడు బతుకమ్మతో పాటు తెలుగు పండుగలను ఘనంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సమాజ్ బేహరన్ గౌరవ అధ్యక్షులు అల్లే గంగాధర్, అధ్యక్షులు వేముల కృష్ణ, సుదర్శన్, సుధాకర్, శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డు వద్ద కమాన్ ప్రారంభం

బీర్‌పూర్, అక్టోబరు 13: మండల కేంద్రంలోని ఘాటు రోడ్డు వద్ద ఇటీవల మున్నూర్ కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమాన్‌ను ఆదివారం మండలంలోని మున్నూరు కాపు సంఘం నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి కమాన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీర్‌పూర్ మాజీ ఉప సర్పంచ్ హరీష్, ఎనుగుమట్ల శ్రీనివాస్, అప్పాల జలందర్, ఎనుగుమట్ల రాజేశం, రామకిష్టు గంగాధర్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ భూమిలో ఇరువర్గాల వివాదం

● తోపులాటతో పోలీసుల రంగప్రవేశం

కథలాపూర్, అక్టోబరు 13 : మండల కేంద్రం శివారులో ఉన్న వరదకాలువకు చెందిన భూమి విషయంలో దుంపెట గ్రామస్థులు, రెడ్డి సంఘ సభ్యుల మధ్య వివాదం నెలకొంది. తాము పది సంవత్సరాల కిందట బోరు వేసుకుని భూమి అభివృద్ధి చేసుకున్నామని మండల రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు పేర్కొనగా ఆ భూమి దుంపెటకు చెందిన సర్వే నంబర్‌లో ఉందని ఆ గ్రామస్థులు వాదించడంతో వివాదం ముదిరింది. గ్రామ అవసరాల నిమిత్తం వినియోగించుకుంటామని దుంపెట వాసులు అక్కడికి వచ్చి ఆందోళనకు దిగారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న ఎస్సై నవీన్, సీఐ సురేశ్‌బాబు సంఘటనా స్థలంకు చేరుకున్నారు. భూమి ఎవరికి చెందుతుందనే విషయం రెవెన్యూ, ఎస్సారెస్పీ అధికారులు తేల్చుతారని అప్పటి దాకా ఎవరూ ఆ భూమిలోకి వెళ్లవద్దని సీఐ నచ్చ జెప్పారు. ఈ నేపథ్యంలో రెండెకరాల భూమి ఎవరికి చెందుతుందనేది సర్వే జరిగే దాకా వివాదాస్పద భూమిలోకి ఎవరూ వెళ్ళమని రాత పూర్వకంగా పోలీసులకు ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్‌లో రాసి ఇచ్చారు.

కారు ధ్వంసం : కేసు నమోదు

జగిత్యాలరూరల్, అక్టోబరు 13 :జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన మర్రిపెల్లిసాయికి చెందిన కారును ధ్వంసం చేసిన వ్యక్తుల పై కేసు నమోదు చేసినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మర్రిపెల్లిసాయి తన కారును రోడ్డు పక్కకు పార్కింగ్ చేయగా అదే గ్రామానికి చెందిన తిరుపతి, మధు, మనోజ్, రంజిత్ పాత కక్ష్యలు మనసులోపెట్టుకొని కారును ధ్వంసం చేసినట్లు తెలిపారు. బాధితుడు సాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా సాయిబాబా పుణ్యతిథి వేడుకలు


సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే


దాతలను సన్మానిస్తున్న నిర్వాహకులు

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 13: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం సాయిబాబా 106వ పుణ్యతిథి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అన్నదాన కార్యక్రమన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుజాత, నాయకులు మహాజన్ నర్సింలు, భక్తులు పాల్గొన్నారు.

మల్లాపూర్ : మండల కేంద్రంతో పాటు ముత్యంపేట, చిట్టాపూర్, నడికూడ గ్రామాల్లో సాయిబాబా దేవాలయాల్లో ఆదివారం పుణ్యతిథి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, అర్చనలు, పూజలు, పల్లకి సేవ తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : మండలంలోని ఆత్మకూర్ గ్రామంలోని ఓం శ్రీసాయి దివ్య మందిరంలోని సాయి బాబకి పట్టణానికి చెందిన గోవర్ధన్ దంపతులు వెండి కిరీటం విరాళంగా అందజేశారు. ఆదివారం సాయి 106వ పుణ్యతిథి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినంతరం స్వామి వారికి వెండితో తయారు చేయించిన కిరీటం అలంకరించారు. దాతలను ఆలయాభివృద్ధి కమిటీ నాయకులు శాలువలతో సన్మానించగా పురోహితుడు మునుగోటి రవిశర్మ స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాలెపు రాజన్న, గంగుల బలరాం, నేరేళ్ల శ్రీధర్, చౌటుపల్లి అంజయ్య, బిజ్జారపు నవీన్, నేరేళ్ల లక్ష్మణ్, నరేష్, గంగాధర్, రాజం, కైలాస్ పాల్గొన్నారు.

ఎనిమిది మంది యువకులపై కేసు నమోదు

రాయికల్, అక్టోబరు 13: విజయదశమి రోజు ఓ యువకుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన 8 మంది యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. రాయికల్ మండలం రామాజీపేట గ్రామానికి చెందిన వేములవాడ నరేష్ దసరా సందర్భంగా జమ్మి చెట్టుకు కాపలాగా ఉన్నాడు. అయితే పూజ అయ్యేంతవరకు జమ్మి ఆకు తెంపవద్దని గ్రామస్థులను కోరుతూ ఉండగా అదే గ్రామానికి చెందిన నవీన్, సంజయ్, గణేష్, ఉదయ్, సుమంత్, సన్నీ, వివేక్, వర్షిత్‌లు నరేష్‌పై దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దసరా ఉత్సవాలు జరుపుకున్న సీనియర్ సిటిజన్స్

జగిత్యాల అర్బన్, అక్టోబరు 13: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బతుకమ్మ పోటీల్లో విజేతలకు, దసరా క్రీడలో విజేతలకు సీనియర్ సిటిజన్స్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ బహుమతులు అందజేశారు. అనంతరం జంబి ఆకులు పంచుకుంటూ అలైబాలైతో దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధుల్లా పని చేయాలి

● కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు

● డీఎస్సీలో జిల్లా స్థాయి ర్యాంకులు సాధించిన అభ్యర్థులకు సన్మానం

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 13: ప్రభుత్వం ప్రవేశపెట్టె పథకాలలో ప్రజలకు, ప్రభుత్వానికి వారధులల ఉపాధ్యాయులు పని చేస్తారని, విద్యార్థులకు ఉత్తమ బోధన చేసి విద్యార్థులను తీర్చిదిద్దాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఆదివారం డీఎస్సీలో జిల్లా స్థాయి ర్యాంక్‌లు సాధించిన ఉపాధ్యాయులను ఆయన పూలమాల శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. నూతనంగా ఉపాధ్యాయ కొలువులు సాధించిన అభ్యర్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొమిరెడ్డి కరం, పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, నాయకులు మార్గం గంగాధర్, పిప్పెర రాజేష్, మర్రి సహదేవ్ పాల్గొన్నారు.

మున్నూరు కాపు జెండా ఆవిష్కరణ

బుగ్గారం అక్టోబర్13: మండల కేంద్రంలో శనివారం శ్రీ దుర్గా భవాని మున్నూరు కాపు ఐక్య సంఘం ఆధ్వర్యంలో నూతన అధ్యక్షులు జాబు పోచన్న మున్నూరు కాపు జెండాను ఎగుర వేశారు. స్థానిక బస్టాండ్ ఏరియాలో ఏర్పాటు చేసిన ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి గ్రామంలోని మున్నూరు కాపులు పాల్గొని ఘనంగా భారీ ర్యాలీ నిర్వహించారు. నాలుగేళ్ల నుంచి ప్రతి ఏటా దసరా రోజున నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి కాపులంత హాజరై వారి ఐక్యతను చాటారు. ఇటీవల ఎన్నికైన నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. పలువురు ప్రముఖులు మాట్లాడుతూ త్వరలో స్థల సేకరణ చేసి, మున్నూరు కాపు ఐక్య సంఘం కు ప్రత్యేక భవనం, ఫంక్షన్ హాల్ నిర్మింప జేయాలని సూచించారు. మున్నూరు కాపు సంఘం భవనం నిర్మించేందుకు గాను గ్రామానికి చెందిన నాయకుడు పొలం పెల్లి మల్లేశం రూ.10 వేల రూపాయలను విరాళం అందజేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం దసరా ఉత్సవాలను జరుపుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రాయికల్, అక్టోబరు 13: మండలంలోని అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 బ్యాచ్ 10వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి టౌన్: పట్టణంలోని ఆరపేట ప్రభుత్వ పాఠశాలలో 2004-05లో ఏడవ తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. 19 ఏళ్ల తర్వాత పాఠశాలలో కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు.



రాయికల్, మెట్‌పల్లిలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సంక్షిప్త సమాచారం

కోరుట్ల రూరల్ : మండలంలోని వెంకటాపూర్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తనయుడు కార్తీక్ ప్రత్యేక పూజలలో పాల్గొన్ని మొక్కులు చెల్లించుకున్నాడు. గత అసెంబ్లీ ఎన్నికలో వేములవాడ నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున తన తండ్రి ఆది శ్రీనివాస్ భారీ మెజార్టీతో ఎమ్మెల్యే ముడుపు కట్టాడు. పురోహితులు ప్రత్యేక పూజలను నిర్వహించగా కార్తిక్ మొక్కు తీర్చుకున్నారు.

మెట్‌పల్లి రూరల్ : మండలంలోని చౌలమద్ది గ్రామంలో నూతనంగా శ్రీరామాలయం, తాతమ్మ దేవాలయాలు నిర్మించడానికి గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు చేపట్టారు. తిరుపతి దేవస్థానం రూ. 20లక్షలు మంజూరు చేయడంతో శనివారం దసరా సందర్భంగా గ్రామంలో భూమి పూజ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, రాజు, హరీష్, శంకర్, లక్ష్మిరాజం, మహేష్, రాములు, రవీందర్, శేఖర్, రుచిత పాల్గొన్నారు.

మెట్‌పల్లి టౌన్: మెట్‌పల్లి నుంచి కామారెడ్డి మీదుగా హైదారాబాద్‌కు వరకు ఎక్స్‌ప్రెస్ బస్సును సోమవారం నుంచి నడుపుతున్నట్లు మెట్‌పల్లి డిపో మేనేజర్ దేవరాజు తెలిపారు. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా ప్రతిరోజు హైదరాబాద్‌కు బస్సు నడుపుతున్నట్లు తెలిపారు. డీఎం దేవరాజును సుఖీభవ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు బొక్కెనపల్లి నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

రాయికల్: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన వడకాపురం సత్యవంశీ ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా కొలువు సాధించగా రెడ్డి సంఘం సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం సభ్యులు అయిండ్లేని రాజరెడ్డి, గుజ్జుల కిరణ్‌రెడ్డి, అంబల్ల భూమారెడ్డి, అయిండ్లేని కృష్ణారెడ్డి, బేతి మల్లారెడ్డి, కుర్మ మల్లారెడ్డి, వినోద్, అయిండ్లేని రాజు, అయిండ్లేని భరత్, సనోద్, అయిండ్లేని రాజు పాల్గొన్నారు.

సారంగాపూర్: నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు యూత్ సభ్యులు. మండలంలోని బట్టపెల్లి గ్రామానికి చెందిన కుందూరి అంజయ్య కుటుంబానికి నూతనంగా ఏర్పడిన లయన్స్ క్లబ్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆ కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

కొడిమ్యాల: మండలంలోని హిమ్మతురావుపేట గ్రామంలో ఆరె రాజిరెడ్డికి చెందిన సుమారు 80 వేల రూపాయల విలువైన గేదె ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. పొలం దగ్గర గడ్డి మేస్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలిపాడు. బాధితుడిని ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని సింగిల్ విండో చైర్మన్ పోలు రాజేందర్ కోరారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రా మంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోతుగం టి శశికుమార్, శేఖర్‌లను డీసీఎం వ్యాను ఢీకొన్న సంఘనటలో తీవ్ర గాయాలైనట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. బాధిత తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కోరుట్ల, అక్టోబరు 13 : పట్టణంలోని మెట్‌పల్లి రోడ్డులోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. పట్టణంలోని నక్కల్ల గుట్ట ప్రాంతానికి చెందిన గోలుసుల సంపత్ (29) అనే యువకుడు తన స్నేహితుడితో ద్విచక్ర వాహనంపై కోరుట్ల పట్టణం నుంచి మెట్‌పల్లి వైపు వెలుతుండగా పెట్రోల్ బంకు సమీపంలో రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది.

దీంతో సంపత్‌కు తీవ్రగాయాలు, మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా స్థానికుల సహాయంతో సంపత్‌ను కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బంధువులు మెరుగైన చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంపత్ ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వారు తెలిపారు. సంపత్ తల్లి బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.